క్లుప్తంగా

జోరుగా ఎన్నికల ప్రచారం



49వ డివిజన్ సచివాయం-బి పరిధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కురసాల శ్రీవిద్య

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ 49వ డివిజన్ సచివాలయం-బీ పరిధిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు మద్దతుగా మహిళలు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా 49వ డివిజన్‌లో ఎమ్మెల్యే కన్నబాబు భార్య శ్రీవిద్య ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె వెంట రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నాయకులు రమణాతి మురళి, మాజీ కార్పొరేటర్లు ఐ.శ్రీను, వెంకటలక్ష్మి, దుర్గ, కడియాల చిన్నా తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో సునీల్, ద్వారంపూడి



జామియా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న చలమలశెట్టి, ద్వారంపూడి

కాకినాడ: మెయిన్ రోడ్డులోని మసీద్ సెంటర్ జామియా మసీదులో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. అక్కడ ముస్లింలందరికీ వారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, సేవాభావంతో రంజాన్ మాసం ముస్లింలందరికీ మంచి జరగాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలిద్‌బిన్ వలీ, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ, మసీదు అధ్యక్షుడు ఇజాదుద్దీన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, వివిధ మసీదుల అధ్యక్షులు ఖ్వాజా మొహిద్దీన్, అతహర్‌దుర్రానీ, కుతుబుద్దీన్ షరీఫ్, జిలానీ, ముస్లిం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేళంగిలో వలంటీర్ రాజీనామా



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న రామసురేష్

కరప: వేళంగి గ్రామ సచివాలయం-1 పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్న ముషిణి రామసురేష్ సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాస్‌కు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామసురేష్ మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్ల పంపిణీకి, ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలన్న ఎన్నికల కమిషన్ నిబంధనతో తాను రాజీనామా చేశానన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలన్న తపనతోనే ఈ రాజీనామా చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఓటర్లకు వివరించి, ఎమ్మెల్యేగా మళ్లీ కన్నబాబును, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తానన్నారు.

కొత్త ఆశల చిగురు

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- గ్రామాల్లో నెలకొన్న ఉగాది సందడి
- వేప పువ్వు సేకరణలో పిల్లలు, పెద్దలు

కరప: మామిడి తోరణాలు.. పూల అలంకరణలు.. వేప పూత సుగంధాలు.. రంగురంగుల హరివిల్లులతో ప్రతి ఇల్లు తెలుగు సంవత్సరాది శోభను సంతరించుకున్నాయి. క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాయి. అరటిలోని మధురం.. చెరకులోని తియ్యదనం.. కొబ్బరిలోని కమ్మదనం.. వేప పువ్వు వగరు.. చింత పులుపు.. కారం తదితర షడ్రుచుల మేలు కలయికే ఉగాది పచ్చడి. సుఖ సంతోషాల.. కలిమిలేముల జీవిత మాధుర్యాన్ని చాటిచెబుతూ ఉగాది రోజున వేప పచ్చడిని ఉదయాన్నే ఫలహారంగా ఆరగించడం తెలుగువారి ఆనవాయితీ.

స్వస్థలాలకు చేరిక

శోభకృత్ నామ సంవత్సరంలోని ఒడిదుడుకులను అనుభవాలుగా, సానుకూలతలను మధురానుభూతులుగా మదిలో పదిలపర్చుకుని క్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాయి తెలుగు లోగిళ్లు. కరప మండలంలోని గ్రామాలు ఉగాది శోభతో కళకళ లాడుతున్నాయి. తెలుగు పండగలను సంప్రదాయబద్ధంగా చేసుకోవడం ఇక్కడి ప్రజలకు పరిపాటి. వివిధ పనుల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా ఉగాది కోసం తమ స్వస్థలాలకు రావడంతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. సోమవారం అంతా ఎక్కడ చూసినా ఉగాది ఏర్పాట్లే. గ్రామాల్లో ఎక్కడ చూసినా చిన్నారులు, పెద్దలు వేప చెట్లెక్కి పువ్వు సేకరణతో సందడి చేశారు. ఇళ్లను శుభ్రం చేసుకోవడం, పిండి వంటల తయారీ, వేప పువ్వును బాగు చేసుకోవడం తదితర పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు.

దుకాణాల కిటకిట

పండగ నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోలు కోసం కరప, వేళంగి, గొర్రిపూడి, నడకుదురు తదితర గ్రామాల్లో వినియోగదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. ఈ ఏడాది వేపచెట్లకు పూత బాగుండటంతో పొలాల్లో వేప పువ్వు సేకరణలో అందరూ నిమగ్నమై కనిపించారు. కాకినాడ-రామచంద్రపురం, కాకినాడ-కోటిపల్లి ప్రధాన రహదారుల్లో కాయగూరల దుకాణాల వద్ద వేపపువ్వు అమ్మకాలు సాగించారు.

ప్రత్యేక పూజలు

క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. కరప విశ్వాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, తర్వాత పంచాంగ శ్రవణం ఉంటుందని అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, అరట్లకట్ట, వాకాడ, కూరాడ, చినమామిడాడ, గొర్రిపూడి, కొరిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



కరప సమీపంలోని పొలాల్లో వేప పువ్వు సేకరిస్తున్న యువకులు

నేటి నుంచి వసంత నవరాత్రులు

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 17 వరకూ వసంత నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి సోమవారం విలేకర్లకు తెలిపారు. ప్రతిరోజు ఉదయం రామలింగేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు, సాయంత్రం అమ్మవారికి నవవర్ణార్చన నిర్వహిస్తారని చెప్పారు.

నవ వసంతం.. సుస్వాగతం

మార్కెట్‌కు ఉగాది శోభ



భానుగుడి సెంటర్‌లో ఉగాది పచ్చడి కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

బోట్‌క్లబ్: తెలుగు సంవత్సరాది ఉగాదిని ఎంతో ఆనందంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఉగాది పచ్చడి చేసుకొనేందుకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకొనేందుకు ప్రజలు సోమవారం మార్కెట్టుకు తరలిరావడంతో మార్కెట్ కిక్కిరిసిపోయింది. నగరంలో ప్రధాన సెంటర్లలో ఉగాది పచ్చడికి కావాల్సిన చెరకుగడలు, మామిడి, కొబ్బరి, వేపపువ్వు తదితర వస్తువులు విక్రయించే దుకాణాలు వెలిశాయి. మధ్యాహ్నం నుంచి స్థానిక సర్పవరం జంక్షన్, భానుగుడి, అశోక్ నగర్, గాంధీనగర్, రామారావుపేట, బాలాజీచెరువు సెంటర్, పెదమార్కెట్, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో పదికి పైగా రోడ్డు పక్కన తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, పచ్చడికి కావాల్సిన వస్తువులు విక్రయించారు. మధ్యాహ్నమే దుకాణాలు ఏర్పాటు చేసినా, ఎండవేడికి ప్రజలకు బయటకు రాలేదు. దీంతో సాయంత్రం వరకూ దుకాణాలు వెలవెలపోయాయి. సాయంత్రం ఐదు దాటిన తర్వాత ప్రజలు బయటకు రావడంతో దుకాణాలు కిక్కిరిశాయి. దీంతో భానుగుడి సెంటర్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పెద్ద మార్కెట్ సెంటర్ కొనుగోలుదారులు ఒక్కసారిగా రావడంతో ట్రాఫిక్ అవస్థలు తప్పలేదు. ఉగాది పచ్చడిలో ప్రధానమైన వేపపువ్వుకు రేటు కొండెక్కింది. గతేడాది చిన్న కట్ట రూ.పదికి విక్రయించగా, ఈ ఏడాది రూ.20కి చేరింది. అరటిపళ్లు, సపోట, కొబ్బరి, మామిడికాయల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. కొబ్బరికాయ మామూళ్ల రోజుల్లో రూ.20కి విక్రయించేవారు. ఉగాది నేపథ్యంలో రూ.30కి విక్రయించారు. అరటిపళ్ల డజను సాధారణ రోజుల్లో రూ.40కి విక్రయించేవారు. ప్రస్తుతం రూ.60కి పెరిగింది. ఇలా రేట్లన్నీ ఆకాశనంటినా ప్రజలకు కొనుగోలు చేయక తప్పలేదు.

నెలాఖరులోపు ఐదు శాతం రాయితీ

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నులు ఏకమొత్తంగా ఈ నెలాఖరు 30వ తేదీలోపు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నామని కమిషనర్ జి.వెంకటరావు వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుర పరిపాలన శాఖ ఉత్తర్వుల ప్రకారం ఆస్తిపన్నుల చెల్లింపు ఏకమొత్తంగా చెల్లించే వారికి ఈ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. చెల్లించే మొత్తం ఐదు శాతం రాయితీ తగ్గించి చెల్లించాలన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ, నగర పరిధిలోని సచివాలయాల్లోనూ చెల్లించవచ్చన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కరప: కొత్త లైన్ నిర్మిస్తున్న కారణంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న హౌసింగ్ కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా కొత్తలైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. కరప, పేపకాయలపాలెం, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు. కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పెనుగుదురు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జ్యోతులకు కన్నీటి వీడ్కోలు

కాకినాడ: అనారోగ్యంతో మరణించిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ జ్యోతుల సీతారామమూర్తికి సోమవారం కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కన్నీటివీడ్కోలు పలికారు. స్థానిక విద్యుపురెడ్డి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులకు పలువురు నేతలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, కైట్ విద్యా సంస్థల ఛైర్మన్ పోతుల వెంకటవిశ్వం, రోటరీ డిస్ట్రిక్ట్ మాజీ ఛైర్మన్ లక్క రాజు సత్యనారాయణ్(టిక్కు), సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు, ప్రజా సంఘాల నేతలు దువ్వా శేషుబాబ్జి, చింతపల్లి అజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అంత్యక్రియలకు హాజరయ్యారు.

హారతులిచ్చి.. పూలవర్షం కురిపించి..

- ద్వారంపూడికి అపూర్వ స్వాగతం
- 30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

కాకినాడ: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి సోమవారం 30వ డివిజన్‌లో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారానికి వెళ్లిన ద్వారంపూడికి అడుగడుగునా పూలవర్షం కురిపించి, హారతులిస్తూ స్థానికులు ఘనంగా స్వాగతించారు. ప్రచారంలో భాగంగా పెంకేవారి వీధి, వాజిపేయాదులవారి వీధి, వేములవారి వీధి, గంజాంవారి వీధి, విజ్జపువారి వీధి, పులవర్తివీధి మీదుగా ఎన్నికల ప్రచారం కోలాహలంగా సాగింది. అడుగడుగునా స్థానికులు, వ్యాపారులు స్వాగతం పలకగా, గడచిన ఐదేళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి తన ప్రచారాన్ని కొనసాగించారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని, ప్రజలకు మరింత అందుబాటులో ఉండి డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ద్వారంపూడి హామీ ఇచ్చారు. నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిగలిగామన్న సంతృప్తి ఉందన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ద్వారంపూడి మరోసారి ఘన విజయం సాధించగలరన్న ధీమా వ్యక్తం చేశారు. త్రిపుర సుందరి ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ మాట్లాడుతూ కాకినాడ పేరు చిరస్థాయిగా నిలిచేలా ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు విజయాన్ని చేకూరుస్తాయన్నారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కూడా ఎన్నికల ప్రచారానికి హాజరై, ప్రజల ఆశీస్సులు కోరారు. కార్యక్రమంలో దివంగత ప్రూటీ కుమార్ మిత్ర బృందంతో పాటు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.



30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోటు యజమానికి ద్వారంపూడి పరామర్శ

కాకినాడ: సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బోటు కాలిపోయిన దుర్ఘటనలో బోటు యజమానిని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. జగన్నాథపురం దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలోని బోటు యజమాని పెమ్మాడి సత్తిబాబు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయనకు ధైర్యం కల్పించారు. ఈ నెల ఐదున విశాఖ సమీపంలో సముద్రంలో బోటులో ఇంజన్ ప్రమాదానికి గురై, బోటు కాలిపోయిందని బాధితుడు సత్తిబాబు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార ప్రతినిధులు చెక్కా చక్రవర్తి బ్రహ్మానందం, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో బోటు యజమాని కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

హామీలు నెరవేర్చాం.. మళ్లీ ఆశీర్వదించండి

- కొవ్వాడ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు
- పెద్దఎత్తున పార్టీలో చేరిన యువకులు

కాకినాడ రూరల్: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చామని, మళ్లీ ఆశీర్వదించాల్సిందిగా వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కొవ్వాడ గ్రామస్తులను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేపూరు రోడ్డు బీసీ పేట నుంచి గ్రామంలో ప్రధాన రహదారుల మీదుగా ప్రచారం సాగింది. గ్రామంలోని మసీదు, రామాలయంలో ప్రార్థనలు, పూజలో పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేదల ఆర్థిక పరిస్థితి మెరుగైందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో, ఆయా కుటుంబాలు బాగుపడ్డాయని, సంక్షేమంతో పాటు, అభివృద్ధికీ పెద్దపీట వేశామన్నారు. కొవ్వాడ గ్రామంలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఎన్నికల కోసం కూటమి కట్టి వస్తున్న వారిని నమ్మొద్దని, వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందుకు కొవ్వాడకు చెందిన యువకులు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి కన్నబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, దామోర రంగబాబు, ఉప సర్పంచ్ తోటకూర శ్రీను, సుధీర్, కండవల్లి రవి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, జంగా గగారిన్, అనుసూరి ప్రభాకర్ పాల్గొన్నారు.



కొవ్వాడలో కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు



ఇఫ్తార్ విందు అనంతరం కన్నబాబు తదితరులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం పెద్దలు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రంజాన్ సందర్భంగా మండలంలోని కొవ్వాడ మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబుకు విజయం కలగాలని జమాత్ ఎ ఇస్లామి హింద్ మసీదు పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలను కన్నబాబు ముస్లింలకు తెలియజేశారు. అనంతరం ముస్లిం పెద్దలంతా కన్నబాబు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, రంగబాబు, సుధీర్, ఉప సర్పంచ్ తోటకూర శ్రీను తదితరులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

13, 14 తేదీల్లో బృహతి సహస్ర యాగం

బోట్‌క్లబ్: మధ్వసభ కమిటీ ఏర్పడి 145 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 13, 14 తేదీల్లో బృహతి సహస్ర యాగాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ యువజన విభాగం అధ్యక్షుడు యాతగిరి పరశురామ్ తెలిపారు. యాగ నిర్వహణపై సమీక్షించేందుకు రామారావుపేటలోని మధ్వసభ ప్రాంగణంలో సోమవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం మఠ ప్రత్యేక ప్రతినిధి, సుధాపండితులు కానుగోవి వాసుదేవాచార్ స్వీయ పర్యవేక్షణలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని పరశురామ్ చెప్పారు. 13న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, దేవతాహ్వానం ఉంటుందన్నారు. సాయంత్రం ఈ హోమ విశేషాలపై సుధాపండితులు విజయసింహాచార్ రఘుప్రేమాచార్, రఘోత్తమాచార్, సుమంతాచార్ పాటిల్ ప్రవచనాలు ఉంటాయన్నారు. 14న బృహతి యాగ హవనం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కమిటీ ప్రతినిధులు కోపెల్ల శేషగిరిరావు, తాడూరి రంగారావు, రాచూరి శేషగిరిరావు, చిల్లరిగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కొత్త అమావాస్య వేడుకలు



టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం నూకాలమ్మ అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయాల్లో భారీగా క్యూలైన్లు కొనసాగాయి. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన టూటౌన్ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు నగర ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండు కి.మీ. మేర భక్తులు క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ లక్ష్మణరావు ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆలయంలో పెద్ద జాగారం వైభవంగా నిర్వహించారు. కాళికాదేవి నృత్యాలు, బ్యాండు మేళం భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు అమ్మవారి ప్రసాదం బూరెలు పంపిణీ చేశారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారిని దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారికి భక్తులు చీరలు, చలివిడి, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.30 దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనంతో పాటు అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు అడబాల లక్ష్మీపతి, పెద్దిరెడ్డి విజయదుర్గ, కనకాల శ్రీనివాస్, పోలిశెట్టి వీరసతీష్, ముమ్మిడి గోవిందరాజులు, వాసంశెట్టి చిట్టియ్య సౌజన్యంతో బూరెలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ సత్యవాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ వారు



టూటౌన్ వద్ద నూకాలమ్మ అమ్మవారు

ఘనంగా గోగులమ్మ తీర్థం

కరప: పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లోని గ్రామ దేవతల తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాసం అమావాస్య ముందురోజు రాత్రి ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలు గోగులమ్మ అమ్మవార్లకు జాతర నిర్వహించి, మొక్కులు తీర్చుకుంటారు. గరగ నృత్యాలు, గారడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో గోగులమ్మను ఆదివారం రాత్రి ఊరేగించి, జాతర నిర్వహించారు. తీర్థం రోజున అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ చింతా నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ చింతా దుర్గాశ్రీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, నాయకులు చింతా బుజ్జి, చోడిశెట్టి చంటి, తోటకూర శ్రీను తదితలు పాల్గొన్నారు.



పెద కొత్తూరు గ్రామ దేవత గోగులమ్మ